సాక్షి
సూర్యాపేట
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



శిలాఫలకం ధ్వంసం
పార్వతీపురం పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలాకాన్ని దుండగులు ధ్వంసం చేశారు. - 8లో



ఇలా.. గుర్తు'పట్టు'
నకిలీ పట్టును గుర్తు పట్టేందుకు కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సిల్క్ మార్క్, హ్యాండ్లూమ్ మార్క్ అందజేస్తుంది. - 8లో



నోరు అదుపులో పెట్టుకో
నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని జగదీష్‌రెడ్డికి మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సూచించారు. - 10లో

న్యూస్‌రీల్

జిల్లా కేంద్రంలో నిఘా పటిష్టం చేయాలి



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం: జిల్లా కేంద్రంలో నిఘా పటిష్టం చేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనాతో కలిసి బుధవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నిరంతరం పెట్రోలింగ్ చేయాలని ఆదేశించారు. నిఘా సిబ్బంది అప్రమత్తంగా ఉండి అనుమానితుల సమాచారాన్ని సేకరించాలని సూచించారు. అధికంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. జిల్లా కేంద్రంలో రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ నవీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమనేతపై కేసీఆర్ కుట్ర బహిర్గతం



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ ఉద్యమనేత కోదండరాంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుట్ర మరోసారి బహిర్గతమైందని తెలంగాణ జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్ అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని తెలంగాణ జనసమితి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తు ప్రణాళికతోనే కోర్టులో కేసు వేయించి కోదండరాం ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వేయించారని విమర్శించారు. ఉద్యమ నాయకుడు చట్టసభల్లోకి వస్తుంటేనే కేసీఆర్ వణికిపోతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ అవినీతిని చట్టసభల్లో నిలదీస్తారనే భయంతోనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు పెట్టి కోదండరాంను ఓడించారని, ఇప్పుడేమో కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కుట్రలకు భయపడేది లేదని, ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ ను ఎండగడతామన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి, విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్ గౌడ్, చివ్వెంల మండల అధ్యక్షుడు సుమన్ నాయక్, యాకూబ్ రెడ్డి, గోపి, మల్సూర్ నాయక్, రాంబాబు, నవీన్, కార్తీక్, శ్రీను పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్ : రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్, టీడీపీలకు చెందిన పలువురు బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీడీపీ హుజూర్ నగర్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి చావా కిరణ్మయి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, రైతు సమితి జిల్లా నాయకులు చావా వీరభద్రరావు కాంగ్రెస్‌లో చేరగా ఉత్తమ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెన్నూర వీరారెడ్డి, గడ్డం రాజు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తి చేసి శ్రీస్వామి అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, నవీన్‌కుమార్, అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

ప్రగతి.. అంతే సంగతి!

- ఏడు నెలలుగా విడుదల కాని పట్టణ ప్రగతి నిధులు
- అభివృద్ధి పనులకు ఆటంకం
- ఐదు మున్సిపాలిటీలకు రావాల్సిన డబ్బులు రూ.8.01కోట్లు



హుజూర్‌నగర్ : ప్రత్యేక పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది, అధికారులు (ఫైల్)

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పన, మెరుగైన పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోయాయి. ఏడు నెలలుగా నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలకు రూ.8.01కోట్లు రావాల్సి ఉంది.

పథకం ప్రారంభంలో ఇచ్చి..

పట్టణ ప్రగతి నిధులను జనాభా ప్రాతిపదికన కేటాయిస్తున్నారు. వీటితో అత్యవసర పనులు, సదుపాయాల కల్పనకు అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. ముఖ్యంగా ఇరుకు రహదారుల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, ప్రకృతి వనాలు, ఓపెన్‌జిమ్, సమీకృత వెజ్ – నాన్ వెజ్ మార్కెట్లు, వైకుంఠధామాల నిర్మాణాలతో పాటు ఉద్యానవనాలను తీర్చిదిద్దడం ద్వారా పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం పెంపొందుతోంది. కొన్ని చోట్ల వాల్ పెయింటింగ్, సూచికలు వంటి ఆకర్షణ పనులు కూడా చేపడుతున్నారు. పథకం ఆరంభంలో నిధుల విడుదల పక్కాగా జరిగింది. కానీ ప్రస్తుతం రావడంలేదు.

నిధుల కోసం ఎదురుచూపులు

జిల్లాలో 5 మున్సిపాలిటీలు ఉండగా వాటికి ఏడు నెలలుగా సుమారు రూ 8.01 కోట్లు విడుదల కావాల్సి ఉంది. వాటిలో సూర్యాపేట మున్సిపాలిటీకి రూ 3.43 కోట్లు, కోదాడ మున్సిపాలిటీకి రూ 2.06 కోట్లు, హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి రూ 1.01 కోట్లు, తిరుమలగిరి మున్సిపాలిటీకి రూ 1.12 కోట్లు, నేరేడుచర్ల మున్సిపాలిటీకి రూ 39 లక్షల చొప్పున మొత్తం రూ 8.01 కోట్లు విడుదల కావాల్సి ఉంది. వాటి కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు.

అరకొర ఆదాయంతో మున్సిపాలిటీలు

మున్సిపాలిటీలకు నల్లా కనెక్షన్, ఆస్తి, ఇతర పన్నుల ద్వారా సమకూరే ఆదాయం అరకొరగానే ఉంటోంది. అవి కూడా సమయానికి వసూలు కావడం లేదు. అయితే ప్రత్యామ్నాయ ఆదాయ వనరుల సృష్టికి అవకాశాలూ అంతంత మాత్రమే. మరోవైపు విద్యుత్ దీపాలు, తాగు నీటి పథకాల నిర్వహణ, వాటి విద్యుత్ బిల్లులు, పారిశుద్ధ్య నిర్వహణ, అత్యవసర ఖర్చులు నెలకు రూ. లక్షల్లో ఉంటున్నాయి. వీటికి నెలవారీ ఆదాయాన్ని మించి ఖర్చు చేసే పరిస్థితి నెలకొంది. చివరకు సిబ్బంది, కార్మికుల వేతనాల చెల్లింపులకూ గడ్డుపరిస్థితులు ఎదురవుతున్నాయి. పారిశుద్ధ్యం, ఇతర అభివృద్ధి పనుల నిర్వహణ కూడా కష్టమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద పట్టణ ప్రగతికి నెలవారీగా వెచ్చిస్తుండగా అవి కొంత అక్కరకు వస్తున్నాయి. అవి ప్రస్తుతం సకాలంలో విడుదల కాక పారిశుద్ధ్యం, స్వచ్ఛ కార్యక్రమాలకు కొంత ఆటంకం కలుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

అభివృద్ధి పనులకు కొంత అవరోధం



మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి నిధులతో ఎంతో మేలు కలుగుతోంది. ఈ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. అన్ని రకాల పనులు పూర్తి చేయడంతో పాటు ప్రజా అవసరాలను సకాలంలో తీర్చేందుకు ఈ నిధులు ఎంతగానో దోహద పడుతున్నాయి. ప్రస్తుతం పట్టణ ప్రగతి నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అభివృద్ధి పనులకు కొంత అవరోధం కలుగుతోంది. పెండింగ్ బిల్లులు ఆలస్యం అవుతున్నాయి.

– కె శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్.

స్టాఫ్ నర్సులకు కలెక్టర్ శుభాకాంక్షలు



సూర్యాపేటలో స్టాఫ్‌నర్సులతో బయలుదేరుతున్న బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఎంపికైన స్టాఫ్ నర్సులకు కలెక్టర్ వెంకట్రావు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోవడానికి జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీనుంచి 212మంది స్టాఫ్‌నర్సులతో బయలుదేరిన ఆరు ఆర్టీసీ బస్సులను బుధవారం కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సురేష్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం, ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శారద, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి



బీబీగూడెం గ్రామంలోని పాఠశాలలో విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. బుధవారం చివ్వెంల మండల పరిధిలోని బీబీగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పిల్లల వివరాలు అడిగి తెలుసుకుని వారికి అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోని 2వ తరగతిలో ఉపాధ్యాయురాలు బోర్డుపై రాసిన తెలుగు పదాలను విద్యార్థులచే చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటల ద్వారా విద్యను అందించడమేగాక నాణ్యమైన పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. ఐసీడీఎస్ అధికారులు కేంద్రాలను నిరంతరంగా పర్యవేక్షిస్తూ పిల్లల బరువు, ఎత్తు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ అంజలీనా, అంగన్‌వాడీ టీచర్ సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈ కార్యాలయ ముట్టడికి తరలిరండి



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్ రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని కోరుతూ ఫిబ్రవరి 2న సాగర్ ఎస్ఈ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సాగర్ ఎడమ కాలువ పరిధిలో బోరు బావుల కింద సాగు చేసిన వరిచేలు చేతికొచ్చే దశలో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ ప్రాజెక్టులో నీటి లభ్యతను బట్టి ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, పారేపల్లి శేఖర్ రావు, బుర్రి శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, వెంకటేశ్వరరావు, కోట గోపి, ఏకలక్ష్మి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు పాటుపడాలి

- అదనపు కలెక్టర్ ప్రియాంక



పెన్‌పహాడ్‌లో వన నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

పెన్‌పహాడ్: అధికారులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ లక్ష్య సాధనకు పాటుపడాలని అదనపు కలెక్టర్ ప్రియాంక కోరారు. బుధవారం పెన్‌పహాడ్‌లోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, వన నర్సరీలను తనిఖీ చేశారు. పాఠశాలలో మంచినీటి వసతి లేక విద్యార్థులు ప్రైవేట్ ప్లాంట్ నుంచి తెచ్చుకుంటుండగా చూసిన అదనపు కలెక్టర్ తాగునీటికోసం రూ.50వేలు వెంటనే మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, ఏపీఓ రవి, ఏపీఎం అజయ్‌నాయక్, ఈసీ ఏకస్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం



త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భానుపురి (సూర్యాపేట) : జిల్లా కేంద్రంలో సుధా బ్యాంకు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా త్యాగరాజ చిత్ర పటంతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి, సుధా బ్యాంక్ అధ్యక్షుడు మీలా మహదేవ్, ఎ. ప్రభాకర్, పెద్దిరెడ్డి గణేష్, ఇమ్మడి సోమనర్సయ్య, కక్కిరేని చంద్రశేఖర్, కామ్లెకర్ శంకర్ లాల్, భోనగిరి భాస్కర్, పానుగోటి నిర్మల, శ్యామల అశోక్, గుడిపాటి అంజయ్య, గేల్లి అంజన్ ప్రసాద్, అడ్వకేట్ శశిధర్, కొత్త మల్లికార్జున్, పర్వతం శ్రీధర్, మీలా వంశీ పాల్గొన్నారు.



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు



త్యాగరాజ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఆర్, మీలా మహదేవ్

యాదాద్రిలో నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాత సేవ చేపట్టి అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ముఖ మండపంలో శ్రీస్వామివారికి అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

పట్టభద్రుల గందరగోళం

- ఎమ్మెల్సీ ఓటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న గ్రాడ్యుయేట్లు
- ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని అధికారుల నుంచి ఫోన్లు
- అవసరం లేదంటున్న ఎలక్షన్ సెల్

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదు విషయంలో దరఖాస్తుదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రులను ఆఫీస్‌కు వచ్చి ధ్రువపత్రాలు (గెజిటెడ్ ఆఫీసర్ సంతకం కలిగిన ఓటరు ఐడీ, డిగ్రీ మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు) ఇవ్వాలని అధికారులు ఫోన్ చేస్తున్నారు. దీంతో పట్టభద్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక మళ్లీ ధ్రువపత్రాలు ఇవ్వాలని కోరడమేంటని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి 2020 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తయిన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అవకాశం ఇచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత సిబ్బందే దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పట్టభద్రుడా కాదా అనేది సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉంది. కానీ, ఆన్‌లైన్‌లో చేసుకున్న వారిని కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్లు ఇవ్వాలని ఫోన్లు చేస్తుండడంతో పట్టభద్రులు కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్లు ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. ఇంత మాత్రానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం దేనికని పట్టభద్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎలక్షన్ సెల్ అధికారులు మాత్రం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు సమర్పించాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

దరఖాస్తులు 2లక్షల పై చిలుకే..

మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 5,05,565 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోగా 3,85,996 మంది (76.35శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం ఈ మూడు ఉమ్మడి జిల్లాల్లో బుధవారం వరకు 2,30,780 మంది ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 98 శాతం ఆన్‌లైన్‌లో చేసుకున్న వారే ఉన్నారు. ఈనెల 6వ తేదీ వరకు గడువు ఉండడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కొత్తవారితోపాటు 2021లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా తిరిగి కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులే విచారణ చేస్తారు

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తమ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లను ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాల్సిన అవసరం లేదు. సంబంధిత సిబ్బంది వారి అడ్రస్‌కు వెళ్లి విచారణ చేస్తారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను మాత్రం ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలి.

– విజయ్, ఎలక్షన్ సెల్ డీటీ, నల్లగొండ

ఎన్ఈపీ రద్దుకు 3న 'చలో ఢిల్లీ'

సూర్యాపేటటౌన్ : నూతన విద్యావిధానం –2020 రద్దు కోసం అఖిల భారత విద్యా హక్కు వేదిక ఆధ్వర్యంలో ఈనెల 3న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో విద్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ– 2020 పేదలను మధ్యలో చదువుకు స్వస్తి పలికేలా చేస్తుందన్నారు. సమావేశంలోఎల్.భద్రయ్య, కరీం, నాగేందర్, వెంకట్, దాసరి రాములు, ఆవుల నాగరాజు, సిద్దీఖ్‌పాషా, కవిత, వెంకన్న, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటయ్య, సుధాకర్, నర్సయ్య పాల్గొన్నారు.

ఈ–పాలనతో పారదర్శకతకు నాంది

జిల్లాపై కలెక్టర్ వెంకట్రావు మార్క్

- బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది
- నిత్యం తనిఖీలతో అధికారుల పనితీరు మెరుగు
- ప్రజావాణిలో మార్పులతో సత్వరమే సమస్యల పరిష్కారం
- సమర్థంగా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణతో దక్కిన రాష్ట్రస్థాయి అవార్డు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈ– గవర్నెన్స్‌తో జిల్లా పాలనలో సమగ్ర మార్పులు తీసుకొస్తున్నారు. ఈ–ఆఫీస్, ఈ – పరిశీలన, ప్రజావాణి వెబెక్స్ ద్వారా నజావుగా పాలనను కొనసాగిస్తూ అధికారుల పనితీరును మెరుగు పరచడమే కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ కలెక్టర్ వెంకట్రావు.. జిల్లాపై తనదైన మార్క్ చూపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి గురువారంతో ఏడాది పూర్తవుతోంది.

మూడు విభాగాలుగా ఈ– పాలన

జిల్లాలో కలెక్టర్‌గా ఎస్.వెంకట్రావు 2023 ఫిబ్రవరి 1న బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటికి జిల్లాలో ఈ– పాలనపై పట్టింపు లేదు. అప్పటికి రాష్ట్రంలో మూడు, నాలుగు జిల్లాలు మాత్రమే పూర్తిగా ఈ– ఆఫీస్ విధానాన్ని కొనసాగిస్తున్నాయి. సూర్యాపేటలో ఆయన ఈ– పాలనను ఈ– ఆఫీస్, ఈ– పరిశీలన, ప్రజావాణి వెబెక్స్ ఇలా మూడు విభాగాలుగా విభజించి అమలు చేస్తున్నారు.

ఈ– ఆఫీస్‌తో వేగంగా..

జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ– ఆఫీస్ విధానం తీసుకొచ్చి ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఫైల్ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడంతో పాటు పరిష్కారంవేగంగా జరిగే అవకాశం ఉంది. ఏడాది కాలంలో జిల్లాలో ఈ– ఆఫీస్ విధానంలో 57 శాఖలకు సంబంధించి సుమారు 30 వేల ఫైళ్ల పరిష్కారమయ్యాయి.

ఈ– పరిశీలనతో మార్పులు..

మండల, గ్రామ స్థాయిలో పనిచేస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, నర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర సంస్థల పనితీరును ప్రత్యేక అధికారులు పరిశీలించి ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌లుగా విభజించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. 2023 మార్చిలో 269 సంస్థల్లో పరిశీలన చేసి 87 సంస్థలకు సీ, డీ గ్రేడ్‌లు కేటాయించారు. వీటిలో మార్పులకు చర్యలు తీసుకున్నారు. 2024 జనవరి 31 వరకు 329 సంస్థల్లో పరిశీలన చేయగా 45 మాత్రమే సీ, డీ గ్రేడ్‌లో ఉన్నట్లు ధ్రువీకరించారు.

ఏడాది పాలన సంతృప్తినిచ్చింది

జిల్లాలో ఏడాది పాలన సంతృప్తినిచ్చింది. అందరి సహకారంతో జిల్లాలో విజయవంతగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాం. రాష్ట్ర స్థాయి అవార్డు రావడం సంతోషంగా ఉంది. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే నా లక్ష్యం. రానున్న రోజుల్లో ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేస్తా.

– ఎస్. వెంకట్రావు, జిల్లా కలెక్టర్

ఈ– పరిశీలన ద్వారా పారిశుద్ధ్యం మెరుగుపడింది. అంగన్‌వాడీలు, హాస్టళ్లు, మధ్యాహ్న భోజనంలో మార్పులు వచ్చాయి. నర్సరీల్లో నాణ్యత పెరిగింది.

ఎన్నికల నిర్వహణకు అవార్డ్

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఇటీవల అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సమర్థంగా నిర్వహించారు. దీంతో కలెక్టర్ వెంకట్రావుకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు వరించింది. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఇది జిల్లాకు దక్కిన గౌరవం.

వెబెక్స్ ద్వారా..

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని వెబెక్స్ ద్వారా చేపడుతూ మండల స్థాయి అధికారులను దీనికి అనుసంధానం చేస్తున్నారు. సమస్యలపై నేరుగా మండల అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించే వెసులుబాటు కల్పించారు. అలాగే సీపీ గ్రామ్ పోర్టల్‌లో ఫిర్యాదులను నమోదు చేస్తుండటంతో ఫిర్యాదుదారులు నేరుగా తమ ఫిర్యాదుల స్థితిని తెలుసుకునే అవకాశం ఉంది. జిల్లాలో ఏడాదికాలంలో 1,797 ఫిర్యాదులు రాగా 1,602 పరిష్కరించారు. మరో 195 పరిశీలనలో ఉన్నాయి.



క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

మిర్యాలగూడ టౌన్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణం కృష్ణమానస కాలనీలో నివాసం ఉంటున్న తూడి వెంకట్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి నకిరేకల్‌కు వెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని వెంకట్‌రెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు.బీరువాలో దాచిన రూ.4వేలతో పాటు ఐదు గ్రాముల బంగారాన్ని అపహరించుకుపోయారు. వెంకట్‌రెడ్డి బుధవారం ఇంటికి తిరిగి రాగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సతీష్‌వర్మ తెలిపారు.

బాలుడి అప్పగింత

భువనగిరి క్రైం: రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన బాలుడిని పోలీసులు సంరక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లోకేష్(12) కుటుంబ సభ్యులు కొన్నేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్థిరపడ్డారు. ఇటీవల అతడి తల్లి అనారోగ్యం బారిన పడడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. తల్లిని చూసేందుకు గాను లోకేష్, తన సోదరి హిమాద్రితో కలిసి బుధవారం భద్రాచలం నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరారు. మార్గమధ్యలో భువనగిరి రైల్వేస్టేషన్ రైలు నిలిపారు. ఈ క్రమంలో లోకేష్ రైలు దిగి స్టేషన్‌లోని వాష్‌రూమ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి రైలు వెళ్లిపోయింది. స్టేషన్‌లో ఒంటరిగా బాలుడు లోకేష్ రోదిస్తుండగా రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు, సత్యనారాయణ, ఉమెన్ కానిస్టేబుల్స్ గమనించారు. అతడిని విచారించగా వివరాలు వెల్లడించారు. ఫోన్ ద్వారా లోకేష్ సోదరి హిమాద్రికి పోలీసులు సమాచారం ఇచ్చారు. ఆమె తిరిగి భువనగిరి రైల్వేస్టేషన్‌కు రాగా లోకేష్‌ను అప్పగించారు.

కాలువలో పడి ఒకరి మృతి


శ్రీనివాస్ మృతదేహం

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలోని నిజాంసాగర్ కాలువలో పడి సూర్యాపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన పింగిళి శ్రీనివాస్(45) మృతిచెందాడు. బతుకుదెరువు నిమిత్తం గ్రామానికి వలస వచ్చిన శ్రీనివాస్ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం మద్యం మత్తులో కాలువలో జారిపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చిన్న గంగారాం పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

నల్లగొండక్రైం: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింక్‌లను నిశితంగా పరిశీలించాలన్నారు. ఫేస్‌బుక్, ఫ్రెండ్స్ రిక్వెస్టు తెలియని వారివి కన్‌ఫర్మ్ చేయవద్దన్నారు. సైబర్ క్రైం జరిగినప్పుడు 8712665575, 8712665625 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఘన శ్యామ్, సీఐ నాగార్జున, టూటౌన్ ఎస్ఐ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు మంజుల, రాజారామ్, జ్యోతి, శైలజ, సరిత, వనజ పాల్గొన్నారు.


పాల్గొన్న విద్యార్థినులు

ఇలా..గుర్తుపట్టు


పోచంపల్లి ఇక్కత్ చీరను ధరించిన యువతి


ఇక్కత్ పట్టు వస్త్రాలు

- స్వచ్ఛమైన పట్టు వస్త్రాలకు క్యూఆర్ బార్‌కోడ్‌తో కూడిన సిల్క్ మార్క్
- మగ్గంపై నేసిన పట్టుకు హ్యాండ్లూమ్ మార్క్ ఉంటుంది
- నకిలీ పట్టు పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి
- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సూచన

భూదాన్‌పోచంపల్లి : శుభకార్యం ఏదైనా వధూవరులు, మహిళలు, పురుషులు, పిల్లలు అని తేడా లేకుండా అందరూ పట్టు వస్త్రాలను ధరించడం సాంప్రదాయంగా భావిస్తారు. పట్టు వస్త్రాలు ధరించడం వల్ల హుందాతనం, అందం ఉట్టిపడుతుంది. దీంతో మార్కెట్లో పట్టు వస్త్రాలకు మంచి ధర, డిమాండ్ ఉంది. వస్త్ర దుకాణాల్లో లైట్ల వెలుగులో పట్టు వస్త్రాలు దగదగా మెరుస్తుంటాయి. కానీ, అందులో ఏది అసలు, ఏది నకిలీ పట్టు వస్త్రమనేది


మల్బరీ పట్టు నూలు

వినియోగదారులు కనిపెట్టడం చాలా కష్టం. వస్త్ర దుకాణాదారులు కూడా వినియోగదారుడిని బురిడీ కొట్టించే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల హైదరాబాద్, వరంగల్, నల్లగొండ తదితర ప్రాంతాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో నకిలీ పట్టువస్త్రాలు పట్టుబడ్డాయి. తాజాగా పోచంపల్లిలో సైతం ప్రింటెడ్ చీరలు విక్రయిస్తున్నారని సమాచారంతో అధికారులు అకస్మికంగా దాడులు నిర్వహించి పలువురి వ్యాపారులకు నోటీసులు అందజేశారు. అందుకే కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ స్వచ్ఛమైన పట్టు వస్త్రాలకు క్యూఆర్ బార్‌కోడ్‌తో కూడిన సిల్క్ మార్క్, మగ్గంపై నేసిన వస్త్రాలకైతే హ్యాండ్లూమ్ మార్క్‌ను అందజేస్తుంది. సిల్క్ మార్క్, హ్యాండ్లూమ్ మార్క్ లేబుల్ ఉన్నట్లయితే అది స్వచ్ఛమైనదిగా గుర్తించవచ్చు. రిజిస్ట్రేషన్ చేసుకొన్న వస్త్ర వ్యాపారులకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి లోగోలను అందజేస్తారు.

పట్టులో పలు రకాలు

పట్టులో అనేక రకాలున్నాయి. అందులో సహజసిద్ధమైన మల్బరీ సిల్క్‌ను 'క్వీన్ ఆఫ్ టెక్స్‌టైల్'గా పిలుస్తారు. ఇది మల్బరీ పట్టు పురుగైన బాంబేక్స్ మోరె నుంచి తయారవుతుంది. ఇది చాలా ఖరీదైనది. ప్రపంచ వ్యాప్తంగా దీనిని 90 శాతం వినియోగిస్తున్నారు. పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలన్నీ మల్బరీ పట్టుతోనే తయారవుతున్నాయి.

అసలైన పట్టును ఇలా గుర్తించవచ్చు

- పట్టు పోగుని వెలిగించినప్పుడు నిరంతరంగా కాలకుండా ఆరిపోతుంది.
- పట్టు కాలినప్పుడు వెంట్రుకలు, ఈకలు కాలిన వాసన వస్తుంది.
- పోగు కొనలో చిన్న నల్లపూసలా మారుతుంది.
- పూసను నలిపినప్పుడు పొడి అయ్యి పోగు గరుకుగా మారుతుంది.
- పట్టు వస్త్రాలను ఎల్లప్పుడు సిల్క్‌మార్క్ అధీకృత షాపుల్లోనే కొనాలి.
- పట్టు వస్త్రాలకు ఉన్న సిల్క్‌మార్క్ లేబుల్ 100 శాతం పట్టు ప్రామాణికతను సూచిస్తుంది.
- పట్టు వస్త్రాలని సిల్క్‌మార్క్ వారిచే ఉచితంగా పరీక్షింప జేసుకోవచ్చు.

- 'టస్సార్ సిల్క్' కాపర్‌రంగులో ఉంటుంది. అడవుల్లో ఉండే పట్టు పురుగుల నుంచి తయారు చేస్తారు. టస్సార్ పట్టును ఎక్కువగా హోం ఫర్నిషింగ్, ఇంటీరియర్ డెకరేషన్‌లో వినియోగిస్తారు.
- ఇండీ పట్టు పరుగుల నుంచి 'ఈరీ సిల్క్' తయారవుతుంది. ఈరీ పట్టును కాటన్, ఉన్ని, జనపనారతో కలిపి ఫ్యాషన్, ఇతర అస్సెస్సరీస్, హోం ఫర్నీషింగ్ తయారు చేస్తారు.
- 'ముంగా పట్టు' బంగారు వర్ణంలో ఉంటుంది. దీనిని తయారు చేసే పట్టు పురుగులు అడవుల్లో ఉంటూ సోమ్ అండ్ సోఆలు అనే చెట్ల ఆకులను తింటాయి.


హ్యాండ్లూమ్ మార్క్, సిల్క్ మార్క్ లోగోను చూపిస్తున్న అధికారులు

సిల్క్ మార్క్ చూసి కొనుగోలు చేయాలి



సిల్క్ మార్క్ అనేది పట్టు వస్త్రాలకు భద్రత లాంటిది. వినియోగదారులు ఎల్లప్పుడూ క్యూఆర్ బార్‌కోడ్‌తో కూడిన సిల్క్ మార్క్ ఉందా లేదా చూసి వస్త్రాలను కొనుగోలు చేయాలి. బార్‌కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేస్తే షాపు వివరాలు తెలిసిపోతాయి. దరఖాస్తు చేసుకొంటే పరిశీలించి వస్త్ర వ్యాపారులకు సిల్క్ మార్క్‌ను అందజేశాం.

– వై.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ సిల్క్‌మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా.

స్వచ్ఛతకు హ్యాండ్లూమ్ మార్క్



ప్రభుత్వం ధ్రువీకరించిన సిల్క్, హ్యాండ్లూమ్ మార్క్‌తో పాటు ఇండియన్ హ్యాండ్లూమ్ బ్రాండ్ ట్యాగ్ కల్గిన వస్త్రాలనే కొనాలి. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా వస్త్రాలను కొనుగోలు చేసే వినియోగదారులు వీటిని ధ్రువీకరించుకొని కొనాలి. కోల్‌కతా, గుజరాత్, హైదరాబాద్ లాంటి నగరాలలో కొందరూ అక్రమార్కులు పోచంపల్లి ఇక్కత్ డిజైన్‌లను కాపీచేసి విక్రయిస్తున్నారని మా దృష్టికి వచ్చింది. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి.– ఎం.వెంకటేశం, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి



సూర్యాపేట డీఐఈఓ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోనే ఇంటర్ మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో డీఐఈఓ కార్యాలయంలో డీఐఈఓ కృష్ణయ్యతో పాటు డీఈసీ సభ్యులకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్ష పేపర్ల మూల్యాకనం నల్లగొండకు వెళ్లి చేయాలంటే లెక్చరర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో లెక్చరర్స్ కర్నాటి శ్రీనివాస్, జి.సైదులు, జ్యోత్స్న, జి.శ్రీను, రాజయ్య, వాసు, వీరయ్య, జనార్దన్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పార్వతీపురంలో పంచాయతీ శిలాఫలకం ధ్వంసం

- భవనం పూర్తికాకుండానే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- ప్రారంభోత్సవ సమయానికి ధ్వంసం చేసిన దుండగులు
- కాంగ్రెస్ నాయకులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సర్పంచ్ ఫిర్యాదు
- అకారణంగా దూషించారని సర్పంచ్‌తో పాటు మరికొందరిపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు


ముక్కలైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ తదితరులు

నిడమనూరు: నిడమనూరు మండలం పార్వతీపురం గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని బుధవారం దుండగులు ధ్వంసం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022సంవత్సరంలో విడుదల చేసిన రూ.20లక్షల నిధులతో గ్రామంలో చేపట్టిన పంచాయతీ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం బుధవారంతో ముగియనుండడంతో శిలాఫలకంపై తన పేరు ఉండాలని సర్పంచ్ వంకా బ్రహ్మన్న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశాడు. ఇంకా పూర్తి కాని పంచాయతీ భవన ప్రారంభోత్సవాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. బుధవారం భవనం ప్రారంభోత్సవం చేసేందుకు సర్పంచ్ వచ్చే సరికి శిలాఫలకం ధ్వంసమై ఉంది. దీంతో సర్పంచ్ వంకా బ్రహ్మన్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి పరిశీలించారు. బీఆర్ఎస్ హయాంలో పంచాయతీలకు నిధులు విడుదల చేశామని, కాంగ్రెస్ వారు ఓర్వలేకనే ఇలా శిలాఫలకాన్ని ధ్వంసం చేసారని ఆరోపించారు. శిలాఫలకాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు వేములపల్లి వెంకట్రావు, మద్దిపూడి రాంబాబు, కుంబం విజయ్, కంచి శ్రీను ధ్వంసం చేశారని అనుమానం వ్యక్తం చేస్తూ సర్పంచ్ బ్రహ్మన్న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా ఎందుకు ప్రారంభోత్సవం చేస్తున్నారని డిగితే దూషించారని స్థానిక కాంగ్రెస్ నాయకుడు వేములపల్లి వెంకట్రావు సర్పంచ్‌తో పాటు వంకా బ్రహ్మన్న, సత్యనారాయణ, నక్క సైదులు, కృష్ణమూర్తిపై మరో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

ఓర్వలేకనే శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు

గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. గ్రామంలో అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేకనే శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.

– వంకా బ్రహ్మన్న, సర్పంచ్, పార్వతీపురం

సమాచారం లేదు

పార్వతీపురం గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం గురించి అధికారికంగా సమాచారం లేదు. భవనం పూర్తి అయిన తర్వాత ప్రారంభిస్తాం. భవనం పూర్తయినట్లు కూడా సమాచారం అందలేదు.

– ప్రమోద్‌కుమార్, ఎంపీడీఓ, నిడమనూరు

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు

- భూ సారం, రోగనిరోధక శక్తి పెరుగుతుంది
- బెండ సాగుకు ఇదే అనువైన సమయం
- హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్


సాగులో ఉన్న బెండ పంట

పాడి పంట

నడిగూడెం : రైతులు బెండసాగులో సేంద్రియ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొం టున్నారు. హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్. దీనివలన భూసారంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుందని చెబుతున్నారు. రసాయన ఎరువుల ఖర్చులను ఆదా చేసుకుని అధిక దిగుబడులు సాధించి లాభాలు ఆర్జించవచ్చని సూచిస్తున్నారు. వచ్చే వేసవి బెండ సాగుకు అనుకూలమని, పంట సాగుకు అవలంబించాల్సిన పద్ధతులు ఆయన మాటల్లోనే..

వాతావరణం : వేడి వాతావరణం అనుకూలం. అతి చల్ల ని వాతావరణం పంట పెరుగుదలకు ప్రతికూలం. అందు వలన పంట వర్షాకాలం, వేసవికాలంలో పండించడానికి అనుకూలమైనది.

నేలలు : సారవంతమైన నీరు ఇంకే తేలికపాటి నేలలు, మురుగు నీటి సౌకర్యం గల తేలికపాటి రేగడి నేలలు అనుకూలం.

విత్తే సమయం : వర్షాకాలపు పంటకు జూన్ నుంచి జూలై వరకు, వేసవి పంటను జనవరి రెండవ పక్షం నుంచి ఫిబ్రవరి చివరి వరకు విత్తుకోవచ్చు.

విత్తన మోతాదు : వేసవి పంటకు ఎకరాలకు 7 నుంచి 8 కిలోల విత్తన సరిపోతుంది.

రకాలు : పర్బని క్రాంతి, అర్కఅనామిక, అభయ

విత్తన శుద్ధి

- విత్తనాలను విత్తే ముందు 12గంటలు నీటిలో నాన బెట్టాలి.
- ఆవు మూత్రం ద్రావణంలో (1:5 నిష్పత్తిలో నీటిలో కలిపి) 30 నిమిషాలు శుద్ధి చేయాలి.
- విత్తనశుద్ధికి 100 మి.లీ. ఆవు మూత్రం, 100 గ్రాములు ఆవు పేడ, 100 గ్రాములు గట్టుమట్టి, లేదా పుట్ట మట్టి కలిపిన నీటిలో ఒక గంట వరకు నానబెట్టి, నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.
- భీజామృతం లేదా అమృత జలం లేదా పంచగవ్యం ద్రావణంలో 8గంటలు నీటిలో నానబెట్టి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.

పొలం తయారీ, విత్తే పద్ధతి : నేలను 4–5 సార్లు బాగా దున్నాలి. వర్షాకాలపు పంటను 60 సెం.మీ ఎడంలో బోదెలపై 30 సెం.మీ దూరంలో విత్తుకోవాలి. నేలను మళ్లుగా చేసి, వరుసల మధ్య 45 సెం.మీ., మొక్కల మధ్య 15 నుంచి 20 సెం.మీ. దూరం ఉండేటట్లు విత్తుకోవాలి. ఒక్కో రంధ్రానికి 2–3 విత్తనాలను విత్తుకోవాలి.

పోషకాల యాజమాన్యం :

- 10 నుంచి 15 మి.లీ. కోడిగుడ్లు, నిమ్మకాయ రసం ద్రావణాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి దిగుబడులు పెంచవచ్చు.
- మొక్కలు మొలిచిన 3–4 రోజుల్లో తొలిసారి 3 శాతం పంచగవ్య ద్రావణం పిచికారీ చేయాలి.
- పూత దశకు ముందే 5 శా తం పంచగవ్య పిచికారీ చేయాలి.
- పంట రెండు వారాల వయస్సులో 400 లీటర్ల జీవామృతం సాగు నీటిలో అందించాలి.
- మొక్క 4–6 ఆకుల దశలో తులసీ–కలబంద కషాయం పిచికారీ చేయాలి.
- పంటపై 2 శాతం పంచగవ్య పిచికారీ చేస్తే దిగుబడులు పెరుగుతాయి.

రక్షణ పంటలు : తోట చుట్టూ జొన్న, సజ్జ, బంతి మొక్కలను పెంచాలి.

అంతర పంటలు : పైరు మధ్యలో బంతి మొక్కలను ఎర పంటగా వేయాలి. అంతర పంటలుగా ముల్లంగి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, క్యాప్సికం, కొత్తిమీర సాగు చేసుకోవచ్చు.

నీటియాజమాన్యం : గింజలు విత్తిన వెంటనే నీరు కట్టాలి. తరువాత 4–5 రోజులకు రెండోసారి నీరు పారించాలి. వేసవి పంటకు అయితే ప్రతి 4–5 రోజులకు ఒకసారి తప్పనిసరిగా నీరు పెట్టాలి.

దిగుబడి : 7 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

భూసార యాజమాన్యం ఇలా..

- దబోల్కర్ పద్ధతిలో వివిధ రకాల విత్తనాలను విత్తి పెరిగిన తర్వాత భూమిలో కలియదున్నాలి.
- ఎకరానికి పశువుల ఎరువు 10 టన్నులు, 500 కిలోల ఘనజీవామృతం, వేప పిండి 100 కిలోలు, వేరుశనగ పిండి 32–40 కిలోలు, 2 కిలోలు అజోస్పైరిల్లం, 2 కిలోలు పాస్ఫోబ్యాక్టీరియా, ఆఖరి దుక్కిలో వేసి, కలియదున్నాలి.
- ఎకరానికి 200 లీటర్ల జీవామృతం, 15 రోజుల వ్యవధిలో సాగు నీటిలో అందించాలి.

బొట్టు..బొట్టు.. పంట చిగురించేట్టు


కన్నెకల్లులో స్ప్రింక్లర్లతో సాగు చేస్తున్న వేరుశనగ


గంధ్రవానిగూడెం శివారులో స్ప్రింక్లర్లతో సాగు చేస్తున్న కొత్తిమీర

మాడుగులపల్లి : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మాడుగులపల్లి మండలంలోని సాగర్ ఆయకట్టేతర ప్రాంత రైతులు బిందు, తుంపర సేద్యంపై దృష్టి సారించారు. డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకొని మెట్ట భూముల్లో పచ్చని పంటలు పండిస్తున్నారు. తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, వేరుశనగ తదితర పంటలను సాగు చేస్తున్నారు. మండలవ్యాప్తంగా 3 నుంచి 4 వేల ఎకరాల్లో వేరుశనగ, కొత్తమీర, దోస, ఇతర కూరగాయలు పండిస్తున్నట్లు మండల ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి తెలిపారు. ప్రభుత్వం బిందు, తుంపర సేద్యం పరికరాలు సబ్సిడీపై అందిస్తే మరింత మంది రైతులు ప్రత్యామ్నాయ పంట సాగు చేసి ఆదాయం గడించే అవకాశం ఉంది.


గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి


పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సంస్థాన్ నారాయణపురం: గ్రామాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అల్లందేవిచెర్వు గ్రామ నూతన పంచాయతీ భవనాన్ని సర్పంచ్ సుర్వి యాదయ్యతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లకు సర్వాధికారులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బద్దం సునిత, వంటల గణేష్, ముక్కెర్ల స్వామి, గుండు రాజు, అండాలు, జయమ్మ, సర్పంచ్‌లు కొలను శ్రీనివాస్‌రెడ్డి, పొట్ట సత్యం తదితరులున్నారు.

కోలాహలంగా కబడ్డీ పోటీలు

మఠంపల్లి: కానుకమాత తిరునాళ్ల సందర్భంగా మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి మూడవ రోజు కోలాహలంగా కొనసాగాయి. పోటీల్లో 38జట్లు పాల్గొనగా ప్రస్తుతం సెమీఫైనల్ పోటీలు జరుగుతున్నాయని నిర్వాహకులు ఉత్సవకమిటీ అధ్యక్షుడు కొత్తపల్లిశౌరి తెలిపారు. గురువారం ఫైనల్ పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు దైదారాయలు, జయరాజు, ప్రసాదు, సైదులు, నాగరాజు, సందీప్, వీరాస్వామి, మట్టయ్య, బాబు, జోజి,అంజి, ఇమ్మానియేల్ తదితరులు ఉన్నారు.


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు